నను విమర్శించుకోవటం. ఇది Anti-climax. తనతల్లి ఏమాత్రమూ ఉపజ్ఞ లేని పని చేసింది. ఆవిడ కిరసనాయిలు పోసుకుని నిప్పంటించుకున్నా, కనీసం ఇంకో బావిలో పడినా తన మెప్పు సంపాదించుకోగలిగేది. పిచ్చిముండ! ఆవిడకి బతకటం ఎట్లా చాతకాలేదో, చావటం కూడా అట్లాగే చాతకాలేదు.

శవాన్ని పైకి తీశారు. బావిచుట్టూ జనం మూగారు. తన భార్యకూడా ఆడ వాళ్ళ మధ్య కనిపించింది. ఎవరో ముసలావిడ గబగబావచ్చి శవంమీదపడి ఏడుస్తూ. "నీ బతుకిట్లా అయిపోయిందేమిటే? నీ కోడలూ, నీ కొడుకూ చేరి నిన్ను గోతిలో తోశారుటే!" అని బిగ్గరిగా వాపోవసాగింది.

ఎన్నడో ఆగిపోయిన యంత్రం ఏదో తన హృదయంలో మళ్లీ ఆడటం మొదలుపెట్టింది. చప్పున భార్యకేసి చూశాడు. భార్య నిర్జీవప్రతిమమాదిరిగా ఉంది. మొహం వెలవెల పోతున్నది. ఊపిరాడక తన్నుకుంటున్నట్టుగా ఉంది.

ఒక్కక్షణంకూడా ఆలస్యం చెయ్యకుండా తను ఆడవాళ్ళల్లో జొరబడి తన భార్యచెయ్యి పట్టుకుని లాక్కుపోయినాడు. వెనుకనుంచి జనం కేకలుపెట్టటం మొదలు పెట్టారు: "అయ్యొయ్యో? దాన్ని కాస్తా ఏం చేస్తాడో సర్రా!"

తను ఇంట్లో అడుగు పెడుతూనే తలుపులు బిడాయించేశాడు. అవతల తలుపులు దడదడా తట్టుతున్నా లక్ష్యం చెయ్యకుండా తను భార్యను గబగబా నడిపించాడు. ఆమె నడవలేకపోతే చేతుల్లో ఎత్తుకునిపోయి పక్కమీద పడుకోబెట్టాడు.

తన భార్య కటికవాడి చేతికి దొరికిన సాధుమృగంలాగా భయంతో తనకేసి కళ్ళు ఆర్పలేకుండా చూస్తున్నది. తను కూడా పక్కనే కూర్చుని కాస్సేపు భార్య వంక కొత్తగాచూస్తున్నవాడల్లే చూశాడు. తరవాత వంగి ఆవిడని ముద్దుపెట్టుకున్నాడు.

తన భార్య నిలువునా కంపించింది. లేవబోయింది. ఆమెను తన చేతుల్లోకి తీసుకుని గాఢంగా ఆలింగనం చేసుకున్నాడు.

"ఒళ్ళు తెలియనట్టు పడుకో, నేను వెళ్ళి తలుపులు తెరుస్తాను. లేకపోతే వాళ్ళంతా చేరి తలుపులు పగలగొడతారు!" అన్నాడు తను.





# దెయ్యాలుంటాయి జాగ్రత్త

ఎత్తుకున్న పేకముక్కల్ని కింద పారేసి బద్ధకంగా ఒళ్లు విరుచుకున్నాడు రెడ్డి.

"డ్రాప్ చేసావా?" ఆత్రంగా అడిగాడు మూర్తి.

"ఊహూ! బోర్ కొడ్తూందోయ్" అంటూ గోడకు జారగిలబడ్డాడు.

"నే నమ్మను. వెధవ ముక్కలు పడుంటాయి ముందు దబ్బులు కక్కుడ్రాప్ చేసినందుకు" అన్నాడు మూర్తి.

అప్పటికి వరసగా ఆటలు పోగొట్టుకుంటున్నాడు మూర్తి. "కావలిస్తే ముక్కలు తిప్పిచూసుకోవోయ్." కోపంగా అన్నాడు రెడ్డి.

మధ్యలో నేను, రాజు కల్పించుకోక తప్పలేదు.

"నిజంగానే విసుగ్గావుంది. కూర్చుని, కూర్చుని కాళ్ళు నొప్పులు పెడుతున్నాయి. ఇక ఆపుదాం" అని సమాధానపరిచాను.

అందరికి చిరాగ్గావుంది. బయటకు అడుగుపెట్టడానికి వీల్లేకుండా పొద్దుటి నుంచి వర్షం.

అనంతపురంనుంచి వస్తానన్న నారాయణ ఇంకా రాలేదు. మధ్యాహ్నం నుంచి అందరం నారాయణ రాకకోసం ఎదురుచూస్తున్నాము.

వర్షంమూలాన ఏ బండి ఎప్పుడొచ్చేది స్టేషనుమాస్టరుకీ సరిగ్గా తెలియడట. అప్పటికీ ఒకరి తర్వాత ఒకరు స్టేషను కెళ్ళి వస్తూనేవున్నాం.

ఇక మా గురించి చెప్పాలంటే నేను, మూర్తి, రాజు, స్కూలుఫైనల్ దాక కలిసి చదువుకున్నాం. తర్వాత అదేదో సినిమాలోలా కాలేజీలో రెడ్డి, యూనివర్సిటీలో వుండగా నారాయణ మా మిత్రబృందానికి కలిసారు.

ఉద్యోగాల మూలంగా విడిపోయినా అందరం అప్పుడప్పుడు ఒక్కొక్క వూర్లో సమావేశం జరుపుతూంటాం. ఆ సందర్భంలోనే ఇలా నారాయణ కోసం ఎదురు చూస్తున్నాం.

"ఇక ఆఖరి మారు స్టేషను కెళ్ళకనుకొద్దాం. ఎవరైనా కంపెనీ వస్తారా?" అడిగాడు రెడ్డి లేచి నిలబడి. గాలి కిటికీ సందుల్లోంచి శబ్దం చేసుకుంటూ వస్తోంది. బయట ఉరుములు చెవుల నదరగొడుతూంది.

"ఇలాంటప్పుడా! మేం రాము బాబూ, పిశాచాలు పీక్కుతింటాయి." అన్నాడు మూర్తి బెడ్డు పరుచుకుంటూ.

మాటల మధ్యలోనే తలుపు శబ్దమయింది. 'నారాయణ వచ్చినట్టున్నాడు' అంటూ రెడ్డి తలుపు తీసాడు. వచ్చిన వాళ్ళెవరో తెలియనీయకుండా వర్షపుజల్లు విసురుగా మొహంమీదకు కొట్టింది.

వెను వెంటనే కళ్ళు చెదిరిపోయేలా ఓ మెరుపు. అంత వెలుగుముందు నేనెందుకన్నట్లు గదిలోనిదీపం అలిగి కూర్చుంది.

అంతా చీకటి మయం.

ఓ తెల్లటి ఆకారం గుమ్మం దగ్గర ప్రత్యక్షమయింది. అంతమందీ ఆతృతగా గుమ్మం వైపు దృష్టి సారించాం "ఏరా నారిగా బాగున్నావా?" అన్నాడు మూర్తి, వచ్చినవాడు నారాయణే అయ్యుంటాడని.

మాట్లాడకుండా లోపలకొచ్చి తలుపులు గడియపెట్టాడు ఆ అగంతకుడు.

తలుపులు వేసేయటం వల్ల మెరుపు వెలుతురుకూడా కరువయింది. "ఎవడు నువ్వు? మా నా...రాయణవేనా...రా" అన్నాడు మూర్తి వణుకుతూ

"ఆఁ నేనే చలితో చస్తున్నా. ఓ సిగరెట్టిలా పారేయ్" అన్నాడు. ఆ గొంతునుబట్టి అది నారాయణదని పోల్చుకున్నాము. అందరం తేలికగా ఊపిరి పీల్చుకున్నాము "ఓరీ నువ్వట్రా. ఇందాకటినుంచి ఎవడివో, ఏ దయ్యానివో భూతానివో అని మూర్తి హడలి చస్తున్నాడనుకో" అన్నాను, నా భయాన్నికూడా మూర్తి మీదకు నెట్టేస్తూ.

"ముందా తడిబట్టలు మార్చుకో" అంటూ టవలు లుంగీ అందించాడు రెడ్డి.

ఫ్లాస్కులో, మా పాలపడకుండా మిగిలిన కాఫీ గొంతులో పోసుకున్నాడు, నారాయణ.

"అమ్మయ్య! సగం ప్రాణం లేచొచ్చింది. ఓ సిగరెట్టుగాని వుంటే మామూలు మనిషినవుతా" అన్నాడు వాడు.

రాజు సిగరెట్టందించాడు.

"అవునుగానీ ఎందుకింత ఆలస్యమయింది?" అడిగాను.

"వచ్చినప్పటి నుంచి వెళ్ళేంతవరకు ఎందుకాలస్యమయిందో చెప్తూకూర్చుంటే నాలాంటి శ్రోతలకు విసుగుపుడుతుంది. టాపిక్ మార్చండి" అన్నాడు రాజు.

ఏం మాట్లాడాలో ఎవ్వరికి తోచలేదు.

"దయ్యాలుంటాయని అందరూ ఒప్పుకుంటారుగా?" అన్నాడు నారాయణ హఠాత్తుగా.

ఊహించని ప్రశ్నకు ఉలిక్కిపడ్డామందరం. ఎందుకంటే మాలో, రెడ్డికి తప్పించి మిగతా అందరికీ ఆంజనేయభక్తి ఎక్కువ. ఆ భక్తికి కారణం దయ్యాలు, భూతాలు అని వేరే చెప్పనక్కరలేదనుకుంటాను.

"నేను నమ్ముతాను". ఒప్పేసుకున్నాడు రాజు.

"నేను కూడా" వంతపాడాను.

"పగలయితే ఒప్పుకోనుగాని రాత్రిళ్ళు అందులోనూ ఇలాటి రాత్రిళ్ళు ......" నసిగాడు మూర్తి.

నేను మాత్రం చస్తే నమ్మను. ఆల్ నాన్సెన్స్" ఖండితంగా అన్నాడు రెడ్డి.

వీడికి కండబలం లేకపోయినా గుండెబలం మాత్రం పుష్కలంగా వున్నట్లుంది.

కాసేపు మౌనం రాజ్యమేలింది.

వర్షం తగ్గేసూచనలు గాని, కరెంటు వచ్చేసూచనలుగాని ఏం కనిపించటంలేదు.

కళ్ళుమూసుకున్నా తెరుచుకున్నా ఒక్కలాగే వుంది. నారాయణ రెండు దమ్ములు గట్టిగాలాగి సిగరెట్టు నేలకేసి రాచి, గొంతు సవరించుకున్నాడు.

"అప్పుడు నంద్యాలలో పనిచేస్తూండేవాడిని కదా! అక్కడ నల్లమలఅడవుల దగ్గరగా బోలెడు పల్లెటూళ్ళు వున్నాయి. కొన్నింటిలో స్కూళ్ళుకూడా వుండేవి. ఇలా వుండగా గవర్నమెంటు వాళ్ళ దగ్గరనుంచి నాకో తాఖీదు వచ్చింది. అక్కడ దగ్గర్లోవుండే ఓ వూర్లో బడి పనిచేయటంలేదని, దానికి గల కారణం కనుక్కురమ్మని.

ఆ వూరికి రైలుసౌకర్యం లేదు. సరి

కదా బస్సులుకూడా మూడుమైళ్ల ఇవతలే ఆగిపోతాయి. అక్కడనుంచి ఆ వూర్లోకి కాలినడకే గతి. తెలిసినవారుంటే బండి వస్తుందిట.

నేను చెప్పా చెయ్యకుండా బయల్దేరిన మూలాన నేను ఏ బండికోసమూ కాచుకో లేదు మూడుమైళ్ళు ఎంతలో పని అని కూడా అనుకున్నాను. కాని టౌన్లలో మనకు నడకలు అలవాటు లేకపోవటంతో అరమైలు నడిచేసరికే అలుపొచ్చింది. పట్టుదలతో ఇంకో అరమైలు నడిచాను. అప్పటికే ఒళ్ళంతా చెమటలు పట్టింది.

నాలుక దాహంతో పిడచకట్టుకు పోసాగింది అలాటి సమయంలో బావి గిలక శబ్దం విన్పించింది. మామూలుగా బావిగిలక శబ్దం వింటూంటే నాకు ఒళ్లంతా కంపరంగా వుటుంది. కాని ఆ సమయంలో అది శ్రవణానందకర మైంది.

శక్తినంతా కూడదీసుకుని ఆ చప్పుడు వస్తున్న దిక్కుకేసి నడిచాను. అక్కడ ఓ ఇరవై సంవత్సరాల యువతి కుండ లోకి నీళ్ళుతోడుకుంటూంది. దగ్గర్లో ఓ ఇల్లులాటి కట్టడంగాని గుడిసెగాని లేదు.

మరి ఆ పిల్ల అక్కడెందుకుందో ఆశ్చర్యం కల్గించినా అవన్నీ పట్టించు కొనేస్థితిలో లేను.

"ఎవరూ" అందా యువతి నేవచ్చిన అలికిడి విని. "దాహంగా వుంది. మంచి. . ." అన్నాను.

"దానికేం" అంటూ దోసిలిలోకి నీళ్ళు పోసింది.

అమృతమంటే ఎలావుంటుందో తెలియదుకాని ఆ సమయంలో అలానే వుంటుందనిపించింది.

"నీ కవిత్వం కట్టిపెట్టి సూటిగా కథ చెప్పవోయ్" అన్నాడు చిరాగ్గా మూర్తి.

"ఆ. అసలు కథలోకేం వచ్చే స్తున్నాం," అని సమాధానపరిచి మొద లెట్టాడు.

"ఆ అమ్మాయి దగ్గరనుంచి కొన్ని విషయాలు రాబట్టుకుందామని మెల్లగా మాటల్లోకి దించాను.

"నీ పేరేమిటి ?"

"సత్తి"

"ఏం చేస్తూంటావ్ ?"

"... ... ..."

"మీ వూరెక్కడ ?

నేను వెళ్ళబోయే వూరే చెప్పింది.

"ఎందాక చదువుకున్నావ్ ?"

"చదువా" — తెల్లబోయింది.

"ఏం మీ వూళ్ళో బడికూడా వుందిగా. నాలుగక్షర ముక్కలు నేర్చుకుంటే ఎందు కైనా మంచిదేగా !"

"మంచిదేగాని ఆ బళ్లో ఎవరు చదువుతారు ? దయ్యాల కొంపకాదూ" అంది గుండెలమీద చెయ్యి వేసుకుని. "దయ్యాలా ! ఎవరైనా చూసారా ?"

"అదంతా నాకు తెలవదు" అని కడవ నెత్తినపెట్టుకొని క్షణాల్లో చెట్ల తోపులమధ్య మాయమయింది. దాహం



తీరగానే నాలో కొత్త ఉత్సాహం ప్రవే శించింది. చురుగ్గా అడుగులువేసి మరో అరగంటకల్లా వూరుకొచ్చేసాను.

ఎండలో తీక్షణత ఇంకా తగ్గలేదు.

నా హఠాత్తాగమనానికి మునసబు ఆశ్చర్యపోయాడు.

"ఇంత ఎండలో వచ్చారేమిటి ? ముందుగా ఉత్తరం వ్రాసుంటే బండి పంపించుండేవాడినికదా" అని నొచ్చు కున్నాడు.

"పెద్దగా ఎండ తెలీలేదులెండి దారిలో మంచినీళ్ళుతాగి కొంచెంసేపు సేదతీర్చు కుని మరీవచ్చాను" అన్నాను నవ్వుతూ.

"దారిలో మంచినీళ్ళు ఎక్కడ దొరి కాయండీ ! ఇది రాయలసీమని మరచి పోకండి" అన్నాడాయన ఆశ్చర్యంగా.

"భలేవారే మీరు. ఎవరో అమ్మాయి. పేరు...సత్తి అని చెప్పింది. నీళ్ళుతోడి పోస్తేనూ."

"సత్తెమ్మా "అన్నాడాయన అదిరిపడి.

నా కేమీ అర్థంకాలేదు.

"అది చనిపోయి రెండేండ్లు పూర్తవుతూంది" అన్నారు.

నాకొక్క క్షణం గుండెకొట్టుకోవటం ఆగిపోయింది.

సత్తి దయ్యమంటే నమ్మలేక పోయాను. అదే ఆయనతో అన్నాను.

"అదేనండి. ప్రస్తుతం ఈవూరి స్కూలును పట్టుకుంది." మీరెంతో అదృష్టవంతులు. అందుకే మధ్యాహ్నం మిమ్మల్ని ఏం చెయ్యకుండా వదిలిపెట్టేసింది.

ఇంతకుముందు ఇద్దరు ముగ్గురు ఆ బావిలోపడి ప్రాణాలు పోగొట్టుకున్నారు. పెదవాడిని చెప్తున్నాను. నామాట వినండి. స్కూలు తనిఖీ వద్దు, ఏమొద్దు. ప్రాణాల కంటేనా ఉద్యోగం?" అని వారించాడు.

నాకుమటుకు ఆయన వాదించినకొద్దీ దాని సంగతి తేల్చుకోవాలన్న పట్టుదల పెరిగింది.

చెప్పి చెప్పి విసిగిపోయాడు.

ఆ రాత్రికి మునసబు ఇంట్లోనే భోజనం చేసాను.

తరువాత నాకు కేటాయించిన గదిలోకొచ్చి స్కూలుకు వెళ్లటానికి తగిన ప్రయత్నాలు చేయసాగాను.

ఇంతలో ఫ్లాస్కులో "టీ" తీసుకుకొచ్చాడు పాలేరు.

మునసబువాళ్ళు చేస్తున్న ఆతిథ్యానికి ముగ్ధుడనయ్యాను. ఆయనమాటలు వినకపోవటం మూర్ఖత్వమేమో ననిపించింది. కాని ఇంతవరకువచ్చి వెనుతిరగటమా?

"ఆ దయ్యం ఎన్నిగంటలకొస్తుంది?"

"రావటం పోవటంలేదు బాబూ! అదే దాని నివాసం. పిల్లగాళ్ళ చదువులు దానివల్ల నాశనమయిపోనాయికదా" అన్నాడు పాలేరు.

ఒకవేళ నిజంగానే వుందేమో దయ్యం. పెద్దమనిషి అబద్ధాలు ఎందుకుచెపుతాడు? ఆలోచనలమధ్య సతమత మవుతూంటే "బయలుదేరుతారా బాబూ?" అన్నాడు పాలేరు.

"ఆఁ" అంటూ లేచాను. జేబులు తడుముకున్నాను. రాత్రికి సిగరెట్లు వున్నాయి.

"నీ దగ్గర అగ్గిపెట్టె వుందా?"

"కొవ్వొత్తులు, అగ్గిపెట్టె అన్నీ తీసుకొస్తున్నా." ఇద్దరంకలిసి స్కూలుదగ్గర కొచ్చాము.

స్కూలు వూరికి చివరగావుందనే చెప్పవచ్చు. చుట్టూరా చెట్లు జుత్తువిరగబోసుకున్న ఆడవాళ్లలా వున్నాయి.

తాళాలువేసి గదిలోకి వచ్చాము.

గదంతా దుమ్ముతో పేరుకొనిపోయి వుంది.

కుర్చీ ఒకటి దుమ్ముతుడిచి తీసుకొచ్చాడు పాలేరు.

"ఇకనే పోతా. జాగ్రత్తండీ బాబు" అని హెచ్చరించి వెళ్ళిపోయాడు. చుట్టూ కీచురాళ్ళశబ్దం.



కొవ్వొత్తి ఒకటి వెలిగించాను.

టీ తాగి గదిఅంతా కలియతిరిగాను.

నిద్రకమ్ముకురాసాగింది. గడియారం వైపు చూసాను. ఇంకా పదికాలేదు.

అప్పుడే నిద్రేమిటి? దయ్యం ప్రభావమా?

మామూలు సమయాల్లో నవ్వుకునేవాడిని కాని ఇప్పుడు ఆ ఆలోచనరాగానే ఒళ్ళు గగుర్పొడిచింది.

ఆరిపోతున్న సిగరెట్టుతో కొత్త సిగరెట్టుకు ప్రాణంపోసాను. సిగరెట్ తాగుతూ గుమ్మంవైపు చూస్తూ కుర్చీలో వాలాను.

అలాకూర్చున్నవాడిని ఎప్పుడు నిద్రపోయానో నాకే తెలియదు. గాజుల చప్పుడువిని గబుక్కున లేచాను.

అంతా కటికచీకటి సిగరెట్ ఎప్పుడో చేతుల్లోంచి జారిపోయింది. కొవ్వొత్తి గాలికి ఆరిపోయినట్లుంది.

నా గుండెశబ్దం నాకే స్పష్టంగా వినిపిస్తోంది.

మెల్లగా లేచి, పాలేరు గూటిలో వుంచిన అగ్గిపెట్టెకోసం తడుముకోసాగాను.

ఒళ్ళంతా తూలిపోతూంది.

అగ్గిపెట్టె దొరికింది. పుల్లగీసాను.

ఆ చిన్న దీపం కొండంత చీకటితో ఢీకొంది.

ఆ వెలుగులో నా ఎదురుగాఉన్న రూపాన్ని చూసి స్తంభించిపోయాను.

ఎదురుగా సత్తి.

మధ్యాహ్నం నేచూసిన సత్తికీ ఇప్పుడున్న ఆకారానికి పోలికేలేదు.

కళ్ళు అగ్నిగోళాల్లా వున్నాయి

జుత్తు విరగబోసుకుంది.

నాలిక బయటకొచ్చి వికృతంగా వుంది.

నా దగ్గరగా రాసాగింది.

నాలో ఒక్కసారి మొండిధైర్యం ప్రవేశించింది. పిల్లైనా సరే గదిలో ఒంటరిచేసి కొట్టబోతే తిరగబడుతుంది.

ఇంకొక అగ్గిపుల్లగీసి కొవ్వొత్తి వెలిగించి దానిమీదకు విసిరేసాను. అలా ఎందుకు చేసానో ఇప్పటికీ నా కర్థం కావటంలేదు. ఆ దయ్యం చీర అంటుకుంది.

ఆ ఆకారం గబుక్కున వెనుదిరిగి పక్కగదిలోకి వెళ్లింది.

ఆ వెలుగు వెంబడి నేను పరుగెత్తాను.

కాని ఎదురుగావున్న ద్వారబంధాన్ని చూసుకోలేదు. కళ్ళుతెరిచేసరికి సూర్యుడు తీక్షణంగా వున్నాడు.

టైము చూసుకున్నాను

తొమ్మిది చూపుతోంది

ఒళ్ళంతా నొప్పులుగావుంది. అంతసేపు నేనెప్పుడూ నిద్రపోలేదు.

నా చుట్టూవున్న పరిసరాల్ని చూసి మరింత ఆశ్చర్యపోయాను నే వున్నది శ్మశానంలో.

ఓపిక చేసుకుని స్కూలు దగ్గరకెళ్లాను.

అక్కడక్కడ నే కాల్చిపారేసిన సిగరెట్ పీకలు, తలుపు పక్కగా కాలిపోయిన చీరముక్కలు కనిపించాయి.

తర్వాత ఇంకొన్ని గదులు పరీక్షించి నంద్యాల కొచ్చేసాను. అక్కడనుంచి ఆ స్కూలుబిల్డింగు ఉపయోగించుకోకుండా వుండటానికి గలకారణం ఏమీ కనబడటంలేదని ఆ వూరి మునసబు మీద తగిన చర్య తీసుకోమని గవర్నమెంటు వాళ్లకు వ్రాసేసాను."

అంటూ కథముగించాడు నారాయణ.

"ఎందుకలా చేసావ్ ?" అడిగాను.

"మీరే చెప్పండి" అన్నాడు నారాయణ, అదోవిధంగా నవ్వుతూ. ఆ నవ్వు చూస్తే భయంవేసింది.

"నే చెప్పాలా ! దీనినిబట్టి దయ్యాలు లేవని తేలిపోయిందిగా" అన్నాడు రెడ్డి గర్వంగా.

ఎవ్వరం మాట్లాడలేదు.

"సరే, ఇప్పటికే పొద్దుపోయింది. తెల్లవారిలేచి తీరిగ్గా వాదులాడుకోవచ్చు" అన్నాడు నారాయణ.

వాడి ప్రశ్నకు జవాబు అన్వేషిస్తూ అందరం నిద్రకుపక్రమించాం. తలుపు దబదబ బాదుతుండగా మెలకువవచ్చింది.

కరెంటు వచ్చింది. అలా ఎంత సేపటినుంచి వెలుగుతుందో !

తలుపులు బార్లా తెరచివున్నాయి.

ఎదురుగా టెలిగ్రాఫ్ మెసెంజర్.

సంతకం పెట్టి కవరు తీసుకున్నాను. ఈ హడావుడికి అందరూ నిద్రలేచారు.

"విజిట్ పోస్ట్ పోన్డ్"—నారాయణ దగ్గరనుంచి టెలిగ్రామ్. మనిషి వచ్చిన తరువాత టెలిగ్రామ్ వచ్చింది, రావటం లేదంటూ. భలే బావుంది అని నవ్వుకుంటూ నారాయణ పడుకున్న చోటు చూసాను. ఆశ్చర్యం !

అక్కడ నారాయణలేడు. కనీసం పడుకున్న ఛాయలుకూడ లేవు

"మరి రాత్రి వచ్చింది......" పూర్తి చెయ్యటానికి ధైర్యం చాలలేదు.

"అంతా మిస్టరీగా వుందే" అన్నాడు బుర్ర గోక్కుంటూ రెడ్డి.

"నే నప్పుడే అనుమానించాను. లేకపోతే మన నారాయణ ఇలాటి దయ్యాల కథలు ఎప్పుడైనా చెప్పాడా ? రాత్రి వచ్చింది దయ్యమే" ఖచ్చితంగా అన్నాడు మూర్తి.

"మరి దయ్యం నారాయణ రూపంలో ఎందుకొచ్చినట్లు ?" సందేహం వెలిబుచ్చాడు రాజు.

"దయ్యాలు అప్పుడప్పుడు ఇలా ఏడిపిస్తాయి మనుష్యుల్ని" అన్నాడు మూర్తి తెలిసినట్లు.

అవును, కాదు అని ఖండించటానికి ఎవరి దగ్గరా ఏ ఆధారాలు కనిపించలేదు. నారాయణ ఏ అఘాయిత్యానికీ తలపడలేదుకదా అన్న అనుమానం కూడా మనసులో కొంచెం పీకింది.

నారాయణకు ఈ విషయమంతా వివరిస్తూ ఉత్తరం వ్రాసాము. మరో రెండు రోజులకల్లా జవాబు వచ్చింది.

"డియర్ ఫ్రెండ్స్

మీరీపాటికి ఆ రాత్రివచ్చింది దయ్యమే అన్న నిర్ణయాని కొచ్చేసుంటారు.

కాని ఆ రాత్రివచ్చింది స్వయానా మీ నారాయణే. ఆ టెలిగ్రాం ఇప్పించిందీ నేనే.

పోతే ఆ రాత్రి చెప్పిన కథ జరిగినదే.

నేను చూసినది మనిషిరూపంలో వచ్చిన దయ్యాన్నికాదు. దయ్యం రూపంలో వచ్చిన మనిషిని.

మనం చనిపోయిన మనిషిని కాల్చేస్తున్నాం. అలా కళ్లెదుటే బూడిదయిన శరీరం తిరిగి రూపం ధరించటం ఎంత సాధ్యమో ఆలోచించండి.

రూపమే అసాధ్యమయినపుడు, వస్తువులు ధరించి కనబడటం, అవి కాలిపోవటం ఇంకెంత హాస్యాస్పదం !

ఆ రాత్రి ద్వారానికి తగిలి పడిపోయినపుడు మునసబు మనుషులే నన్ను శ్మశానానికి చేరేసారు

ఇది మొన్ననే బయట పడింది.

మునసబు ఇంత నాటకం ఆడటానికి గల కారణం ఆ స్కూలు దొంగసారా బట్టీ కావటమే

తన స్వార్థంకోసం కొన్ని వేలమంది పిల్లల భవిష్యత్తును నాశనం చేయటానికి కూడా వెనుదీయలేదు.

కాబట్టి దయ్యాలంటూ లేవు. దయ్యాలు మనుషులవలేవు. మనుష్యులే దయ్యాలుగా, అవసరంవస్తే అంతకంటె ఘోరంగా కూడా మారగలరు.

అలాంటి దయ్యాలుంటాయి తస్మాత్ జాగ్రత్త !

ఇంతకూ మిమ్మలనందరిని ఇంత సస్పెన్సులో పెట్టి ఏడపించటానికి గల కారణం మన ఒప్పందం. ఆ ఒప్పందం ప్రకారం ఎవరయితే మిగిలిన నలుగురిని పూర్తిగా నమ్మిస్తే వాళ్ళు వాడు చెప్పిన మాటకు కట్టుబడివుండాలి కదా !

కాబట్టి మీరు నలుగురూ పది రోజులకు తక్కువ లేకుండా సెలవుపెట్టి నా ఆతిథ్యాన్ని స్వీకరించాలని కోరుతూ...

మీ నారాయణ."

